క్లుప్తంగా

గంగమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చింతకొమ్మదిన్నె : స్థానిక గంగమ్మతల్లి ఆలయంలో రెండు రోజుల తిరునాల సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.పి.విశ్వనాథరెడ్డి, ఆలయ ఈఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళా యాదవ్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సురేంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జున యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఇంటర్ అడ్మిషన్లకు ఆహ్వానం

ఎర్రగుంట్ల : ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి వారు ఇంటర్ విద్యాభ్యాసం మధ్యలో మానివేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఇంటర్‌లో చేరుటకు ప్రత్యేక ప్రవేశాలకు అవకాశం కల్పించిందని ఎర్రగుంట్ల ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.త్రివిక్రమ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ ద్వారా ఏప్రిల్ మాసంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ చేరదలచిన వారు తమ పదవ తరగతి మార్కులిస్టుతో ఈనెల 27వ తేదీలోగా ప్రిన్సిపాల్‌ను కలిసి అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహ కల్పిస్తున్న వ్యవసాయాధికారి

ముద్దనూరు : రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేపడితే పంటలో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని బడుగువారిపల్లెలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై ఆయన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు నివారణకు పసుపు, బ్లూ కలర్ జిగురు అట్టలను రైతు పొలంలో ఏర్పాటుచేయాలని సూచించారు. పొలంబడి కార్యక్రమంలో విత్తనం నాటినప్పటి నుంచి కోతవరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

ఎస్టీలకు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం చరిత్రాత్మకం

కడప రూరల్ : ప్రప్రథమంగా ఎస్టీ వర్గానికి ఎమ్మెల్సీ సీట్లను కేటాయించడం చారిత్రాత్మకమని బంజారా సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐ.శివానాయక్ తెలిపారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ గిరిజన వర్గాలను రాజకీయంగా గుర్తించి ప్రోత్సహించడం సంతోషదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసులు, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం డివిజనల్ సెక్రటరి జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్ల వేధింపులు ఆపాలని కోరుతూ మంగళవారం పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులకు ఆచరణ సాధ్యంకాని టార్గెట్లను విధిస్తూ మానసికంగా ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ఉద్యోగులపై టార్గెట్ల వేధింపులను మానకపోతే విజయవాడలోని సీఎంఎంజీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు పీఎం సలాం, రమణయ్య, పాలకొండ్రాయుడు, మునాఫ్, వెంకట్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

ముద్దనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల వారికి పెద్దపీట వేస్తున్నారని పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11 మంది బీసీ నేతలకు ఎమ్మెల్సీ పదవులు కేటాయించి బీసీలలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దిన్నెపాటి గంగమ్మతల్లి తిరునాల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి అమ్మవారు



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్/రూరల్ : పట్టణంలోని కదిరి రోడ్డులో వెలసిన దిన్నెపాటి గంగమ్మతల్లి తిరునాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిన్నెపాటి గంగమ్మతల్లి ఆలయంలో గంగమ్మతల్లి అమ్మవారికి మంగళవారం ఆలయ నిర్వాహకులు వెంకటనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.80 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు గెలుపొందిన ఎద్దుల యజమానులకు అందించారు.

సాయంత్రం అమ్మవారి బిందె సేవ కార్యక్రమం నిర్వహించి రాత్రి 8 గంటలనుంచి జ్యోతుల కార్యక్రమం నిర్వహించారు.

ఈ క్రాప్ వివరాలపై తనిఖీ

వీరపునాయునిపల్లె : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను, ఈ క్రాప్ నమోదు వివరాలను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రవీణ్ మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్‌రావుతో కలసి తంగెడుపల్లె రెవెన్యూ పరిధిలో పంట పొలాలను తనిఖీ చేశారు. ఈ క్రాప్‌లో నమోదు చేసిన వివరాలను పొలాల వద్ద రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నమోదులో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. సున్నా వడ్డీ, పంట దిగుబడుల కొనుగోలు వంటి ప్రభుత్వ పథకాలు ఈ క్రాప్ చేసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తాయని సూచించారు. సాగు ఖర్చులు, దిగుబడుల వివరాలను రైతులతో చర్చించారు. కార్యక్రమంలో కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, టెక్నికల్ ఏఓ సుమంత్, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు గంగయ్య, గురునాయక్, కుమార్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ రైతు భరోసా కేంద్రం పరిధిలో శనగ పంట నమోదుపై మంగళవారం కమిషనర్ కార్యాలయ అధికారి ప్రవీణ్, ఏడీఏ సుబ్బారావులు ఆరా తీశారు. అలాగే గ్రామాలల్లో పంట నమోదు, దిగుబడి వంటి వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ బ్లెస్సీ, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ

సింహాద్రిపురం : బలపనూరు పంచాయతీ పరిధి నక్కలపల్లె గ్రామ సమీపంలోని ప్రమాద స్థలాన్ని మంగళవారం పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్ పరిశీలించారు. ఇటీవల నక్కలపల్లె బస్టాప్ వద్ద గతనెల 7వ తేదీన గుర్తు తెలియని వాహణం ఢీ కొన్న ప్రమాదంలో పుట్టపర్తికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పట్లో గుర్తు తెలియని వాహనం అని కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కేసుకు సంబంధించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలాన్ని ఎంవీఐ ప్రసాద్ పరిశీలించారు.

వాహనాల తనిఖీ :

సింహాద్రిపురం–నిడివెల్ల క్రాస్ వద్ద ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు సూచనలు ఇచ్చారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని.. లేకుంటే జరిమానాలు విధిస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని ఆయన హెచ్చరించారు.



నక్కలపల్లె బస్టాఫ్ వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ, ఎస్ఐ

పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్ : ముద్దనూరు తాలుకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం కడపలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికను ఏకగ్రీవం చేశారు. ఇందులో అధ్యక్షుడిగా విశ్రాంతి అధ్యాపకులు రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యక్షుడిగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, కార్యదర్శిగా విశ్రాంతి ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటరామిరెడ్డి, ప్రభాకర్, నాగన్న, రామకృష్ణారెడ్డి, బాలవెంకటరెడ్డి, కోశాధికారిగా రాజగోపాల్‌రెడ్డి, సయుక్త కార్యదర్శులుగా వెంకటేష్, రాజారెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఈవీ నారాయణరెడ్డి, రామచంద్రుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ప్రబాకర్‌రావు, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి, రామనాథరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామూర్తినాయుడు, సహాయ ఎన్నికల అధికారులుగా జిల్లా ఉపాధ్యక్షులు బాలఎల్లారెడ్డి, రాధకృష్ణ, పరిశీలకులుగా నాగమునిరెడ్డి వ్యవహరించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ముద్దనూరు నూతన కార్యవర్గ నాయకులు

ఉగాది పండుగకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

సింహాద్రిపురం : ఉగాది పండుగ నాటికి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని మండల స్పెషలాఫీసర్ నాగ లింగాచారి మండల అసిస్టెంట్ ఇంజనీర్లకు సూచించారు. మండల కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మండల అసిస్టెంట్ ఇంజనీర్లతో సమావేశమై మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ఉగాది నాటికి 611 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మండల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత అటెండెన్స్ తప్పక వేయాలన్నారు. అలాగే ఇళ్ల లబ్ధిదారులకు రూ.35 వేల రుణం తప్పక ఇప్పించాలన్నారు. అనంతరం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, డీటీ వెంకటరెడ్డి, ఏపీఎం మంజునాథ, అసిస్టెంట్లు ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్, తదితరులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక సర్వసతి విద్యా మందిరం పాఠశాలలో మంగళవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలు–మానవత్వం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ఆ సంస్థ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, ఆ సంస్థ గౌరవ కుటుంబ సభ్యులు చంద్రశేఖరరెడ్డిలు మెమెంటోలతోపాటు సర్టిఫికెట్లు పెట్టుకునే ఫైల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థికి మెమెంటోను అందిస్తున్న దృశ్యం

జాబ్‌డ్రైవ్‌లో 10 మందికి ఉద్యోగాలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 10 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్ తెలిపారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌డ్రైవ్‌లో హెటిరోల్యాబ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరై జూనియర్ కెమిస్ట్/జూనియర్ ఆపరేటర్, జూనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు 10 మందిని ఎంపిక చేశారన్నారు. జేకేసీ కోఆర్డినేటర్ డా. కె.రేఖ, మెంటార్లు సారథి, మంజుల, హెటిరో సంస్థ ప్రతినిధి సీమోను పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పొరపాట్లు ఉండకూడదు

డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి



సామాజిక తనిఖీ ఒపెన్ ఫోరంలో సమీక్షిస్తున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు మండలంలో 2021–22 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం జరిగిన 16వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో ఆయన పాల్గొని సామాజిక తనిఖీ నివేదికలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగింపు దశలో వున్నందున ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించి అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. ప్రతిరోజు పని ప్రారంభ సమయంలో ఒక ఫొటో, ముగించిన తరువాత ఒక ఫొటోను ఎన్‌ఎంఎంఎస్ ద్వారా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. కూలీలకు ఇబ్బందులు లేకుండా పనులు కల్పిస్తూ రోజుకు సరాసరి వేతనం రూ.257 పడేలా చూడాలన్నారు.

రూ. 63,426 రికవరీ చేయాలి :

సామాజిక తనిఖీ బృందం గుర్తించిన మేరకు పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టని పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల నుంచి రూ. 63,426 నగదును రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ప్లాంటేషన్ పనుల్లో తక్కువ చెట్లు వున్న చోట్ల తిరిగి మొక్కలను నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీఓ యోగాంజనేయరెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, కమలాపురం క్లస్టర్ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, క్వాలిటీ కంట్రోల్ అధికారులు విజయభాస్కర్, అంజలి, ఏఈలు పవన్, ముజీబ్, ఎస్‌ఆర్‌పీ తిరుమలేసు, ఏపీఓ పార్థ సారథి, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన :

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ పీ యదుభూషన్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని వల్లూరు, గోటూరు గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఫీల్డ్ కాలువల పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును గురించి, కూలీ గురించి కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగుచేసిన మామిడి, చీనీ తోటలను ఆయన పరిశీలించారు. రైతులకు అందాల్సిన చెల్లింపులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, ఏపీఓ పార్థసారధి, ఈసీ అన్నా నాయక్, టీఏలు రెడ్డయ్య, కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

– పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు



పులివెందుల : పోలీసు ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించి పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగం పొందాలనుకునేవారికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శిక్షకులు మనోహర్, బృంద సభ్యులు స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో పరుగు పందెం, లాంగ్ జంప్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని.. ఈ శిక్షణకు ఎటువంటి ఫీజు వసూలు చేయడంలేదని.. అర్హులైన వారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పార్నపల్లె రోడ్డులోని శ్రీమహాలక్ష్మి ఫర్టిలైజర్స్ యాజమని మనోహర్‌ను కానీ, 9963185756 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మహిళలు హక్కుల కోసం పోరాడాలి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : సమాజంలో హక్కుల కోసం మహిళలు పోరాటం సాగించాలని మైలవరం దళిత సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఓ మహిళ మేలుకో మన హక్కుల కోసం ఉద్యమించుదాం అనే కార్యక్రమాన్ని వారు నిర్వహించి మాట్లాడారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. 50 శాత సబ్సిడీతో గ్యాస్ సిలిండర్‌ను అందించాలని వారు డిమాండ్ చేశారు. అసైన్‌మెంట్ కమిటీలో భూమిలేని నిరుపేదలకు 3 ఏకరాలు భూమి కేటాయించాలని వారు కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రూపేష్‌కు వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడమే ధ్యేయం

పులివెందుల టౌన్ : పులివెందులను ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడమే ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మారుతి హాలు రోడ్డులో ఉన్న సురేష్, మల్లికార్జున అంగళ్లపై మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన దాడులు చేశారు. ఈ దాడులలో సుమారు 1500 కేజీల ప్రభుత్వ నిషేదిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని.. దుకాణ యజమానులు సురేష్‌కు రూ.10 వేలు, మల్లికార్జునకు రూ. 20వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేదిత కవర్లు ఎక్కడైనా కనిపించినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర, సచివాలయ, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

మాతృభాషపై మక్కువ కలిగి ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు మాతృభాషపై మక్కువ కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ అన్నారు. మంగళవారం జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంపై సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మాతృభాష వస్తే ఏ భాషనైన సులభంగా అర్థంచేసుకోవచ్చు అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తెలుగుభాష ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోధ్యాపాయుడు సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మాతృభాష గురించి వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్

విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి కవిత

కడప అర్బన్ : విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని, చదివిన సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంను జడ్జి సందర్శించారు. వంటశాలను, వసతిగదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రసాద్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మినారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెన్నపూస విజయానికి కృషి చేయాలి



వైఎస్‌ఆర్‌సీపీ నేతలతో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రారెడ్డి

వల్లూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీ నేతలందరూ కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కడప పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరు, పెండ్లిమర్రి మండలాలకు చెందిన పార్టీ నేతలతో మంగళవారం వేరు వేరుగా ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికీ ఓటు నమోదు చేసుకోని గ్రాడ్యుయేటర్లను స్థానిక నేతల ద్వారా గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల గడువులోగా ఓటర్ల నమోదును పూర్తిచేయాలన్నారు. ప్రతి ఓటరు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి పార్టీ నేతలకు అందచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్‌ఆర్‌సీపీ చెన్నూరు మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ నేతలు శివశంకర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, రామమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డి పట్టభద్రుల సమస్యలపై పోరాడి వాటిని పరిష్కరిస్తారన్నారు. పట్టభద్రులు తమ ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలన్నారు. వార్డులలో ఆయా వార్డుల కౌన్సిలర్లు కూడా ప్రచారం నిర్వహించి పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, డేనియల్ బాబు, ఖాదర్‌బాషా, కొండ్రావు, లక్ష్మీభార్గవి, ఆలయ చైర్మన్లు సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, కడియాల లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీరాములు, డేనియల్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.